

హైదరాబాద్ వార్త

# గచ్చిబౌలిలో కుంగిన భవనం కూల్చివేత

- హైడ్రా అధునాతన యంత్రంతో కూల్చివేత పనులు
- రాత్రికి రాత్రే కట్టుబట్టలతో రోడ్డున పడ్డ 50మంది
- చుట్టు పక్కల భవనాల్లో ఉంటున్న వారిని ఖాళీ చేయించిన అధికారులు

**గచ్చిబౌలి, నవంబరు 20 ప్రభాతవార్త**

గచ్చిబౌలిలో పిల్లర్లు కుంగి పక్కకు ఒరిగిన భవనం కూల్చివేత పనులను అధికారులు బుధవారం చేపట్టారు. ఐదంతస్థుల భవనం పక్కనే పుట్టింగ్ తవ్వకాల కారణంగా పిల్లర్లు కుంగి భవనం ఓ వైపుకు ఒరిగిపోయి ప్రమాదకరంగా మారడంతో అధికారులు భవనాన్ని పూర్తిగా కూల్చివేస్తున్నారు. ఎటువంటి సెట్‌బ్యాక్ లేకుండా చుట్టు ప్రక్కల ఉన్న భవనాలు ఆనుకొని ఉండడంతో భవనం కూల్చివేత అధికారులకు కత్తిమీద సాముగా మారింది. మంగళవారం సాయంత్రం భవనం ఓవైపుకు ఒరిగిపోయిన వెంటనే అందులో ఉన్న దాదాపు 50మందిని అధికారులు ఖాళీ చేయించగా, ఒరిగిన భవనం ప్రమాదకరంగా మారడంతో చుట్టు ప్రక్కల భవనాలు, ఇళ్లలో ఉన్న వారిని సైతం అధికారులు అక్కడి నుంచి సురక్షిత ప్రాంతాలకు తరలించారు. హైడ్రా ఆధీనంలోని అధునాత బాహుబలి హైడ్రాలిక్ జా క్రషర్ యంత్రంలో బుధవారం మధ్యాహ్నం కూల్చివేత పనులు చేపట్టగా, మధ్యలో మిషన్‌లో వచ్చిన సాంకేతిక ఇబ్బందులతో కూల్చివేత పనులు కొద్దిసేపు నిలిచిపోయాయి. తిరిగి సాయంత్రం సమయంలో కూల్చివేత పనులను అధికారులు చేపట్టారు. భవనంలో సిలిండర్లు, సామాగ్రి ఉండడం, చుట్టు ప్రక్కల భవనాలకు ఆనుకొని ఉండడంతో అధికారులు అతి జాగ్రత్తగా కూల్చివేతను చేపడుతున్నారు. శేరిలింగంపల్లి సర్కిల్ పరిధిలోని గచ్చిబౌలి సిద్దిఖ్‌నగర్‌లో గల రోడ్డు నెంబరు 1లో ప్లాటు నెంబర్లు 1605,1638లను కలుపుకొని మొత్తం 200 గజాల విస్తీర్ణంలో కల్వకుల్ల శ్రీను అనే వ్యక్తి బహుళ అంతస్థుల నిర్మాణానికి పనులు చేపట్టాడు. పనుల్లో భాగంగా గత మూడు, నాలుగు రోజులుగా సెల్లార్ పుట్టింగ్ తవ్వకం చేపట్టాడు. కాగా ఎటువంటి సెట్‌బ్యాక్ లేకుండా, నిర్లక్ష్యంగా తవ్వకం పనులు చేపట్టడంతో ఈ స్థలానికి పక్కనే ఉన్న ప్లాట్ నెంబరు 1639లోని లక్ష్మణ్ అనే వ్యక్తికి చెందిన 5 అంతస్థుల భవనం పిల్లర్లు బయటకు వచ్చాయి. ఎటువంటి రక్షణ గోడలు ఏర్పాటు చేయకుండా తవ్వకాలు చేపట్టడంతో లక్ష్మణ్‌కు చెందిన ఐదంతస్థుల భవనం పిల్లర్లు బయటకు రావడం, భూమి వదులుగా మారడంతో పిల్లర్లు కుంగి మంగళవారం రాత్రి ఒక్కసారిగా భవనం ఓ వైపుకు ఒరిగిపోయింది. భారీ శబ్దంతో భవనం ఓవైపుకు ఒరిగిపోవడంతో అందులో ఉన్న వారు ఆహాకారాలతో బయటపడ్డారు. స్థానికుల సమాచారంతో సంఘటనా స్థలికి చేరుకున్న పోలీసులు, జీహెచ్‌ఎంసీ డిఆర్‌ఎఫ్ టీమ్, హైడ్రా అధికారులు అందులో ఉన్న వారిని మొత్తం ఖాళీ చేయించారు. భవనం ప్రమాదకరంగా మారి ఎప్పుడు కూలుతుందో తెలియని స్థితిలో ఉండడంతో చుట్టు ప్రక్కల భవనాలు, ఇళ్లలో ఉన్న వారిని సైతం ఖాళీ చేయించారు. బుధవారం ఉదయం శేరిలింగంపల్లి జోనల్ కమీషనర్ ఉపేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో అధికారులు భవనాన్ని పరిశీలించారు. ప్రమాదకరంగా మారిన భవనాన్ని కూల్చివేయాలని నిర్ణయించి, అందుకు అనుగుణంగా భవన యజమాని లక్ష్మణ్‌కు నోటీసులు జారీ చేశా రు. లక్ష్మణ్ అనుమతి తీసుకున్న తరువాత హైడ్రా అత్యాధునిక హైడ్రాలిక్ జా క్రషర్ యంత్రంతో కూల్చివేత పనులు చేపట్టారు. కాగా భవనాల మధ్య ఖాళీ స్థలం తక్కువగా ఉండడం, ప్రమాదకర భవనానికి ఆనుకొని ఇతర భవనాలు ఉండడంతో కూల్చివేతలు మందకోడిగా సాగుతున్నాయి. ఇతర భవనాలకు ఇబ్బందులు కలుగకుండా కంట్రోల్డ్ కూల్చివేతలు చేపడుతున్నారు.

**కట్టుబట్టలతో రోడ్డున పడ్డ 50మంది...**

కాగా అక్రమ భవనంలో అద్దెకు ఉన్న పాపానికి రాత్రికి రాత్రే దాదాపు 50 మంది కట్టుబట్టలతో రోడ్డున పడ్డారు. కేవలం 60 గజాల విస్తీర్ణంలో ఐదంతస్థుల భవనం నిర్మించగా, అందులో మొత్తం 8 పోర్షన్లలో దాదాపు 50మంది ఉంటున్నారు. మంగళవారం రాత్రి ఒక్కసారిగా భారీ శబ్దంతో భవనం ఓవైపుకు ఒరిగి పోవడంతో ఇందులో ఉంటున్న వారు ఆహాకారాలతో బయటకు వచ్చారు. మొదట భూకంపం వచ్చిందని భ్రమించినా, ఈ భవనం మాత్రమే కుంగిపోవడంతో ఎవ్వరికి ఏమి అర్థం కాలేదని వాపోయారు. పలు కుటుంబాలు పిల్లలతో రోడ్డున పడగా, సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు, కార్మికులు ఒక్కసారిగా కట్టుబట్టలతో రోడ్డుపై నిలబడ్డారు. తమ సర్టిఫికేట్లు, ల్యాప్‌టాప్‌లు, బంగారం, ఇట్లో వస్తు వులు, బట్టలు సైతం తీసుకునే అవకాశం ఇవ్వ కుండా భవనం కూల్చివేత చేపడుతుండడంతో వారంతా బోరుమంటున్నారు.



భవనం కూల్చివేతతో రోధిస్తున్న లక్ష్మణ్ కుటుంబ సభ్యులు



హైడ్రా అత్యాధునిక యంత్రంలో భవనం కూల్చివేత చేపడుతున్న అధికారులు

**శీనయ్య... ఎంతపని చేశావయ్యా...**

మరోవైపు శీనయ్య... ఎంతపని చేశావయ్యా అంటూ భవన యజమాని లక్ష్మణ్, అతని భార్య స్వప్నలు హృదయవిదారకంగా రోధిస్తున్నారు. ఈ భవనం పక్కనే కల్వకుల్ల శ్రీను అనే వ్యక్తి నిర్మాణం కోసం తీసిన సెల్లార్ పుట్టింగ్ కారణంగా పిల్లర్లు కుంగి భవనం ఒవైపుకు ఒరిగిపోయిందని వాపోతున్నారు. తవ్వకాల సమయంలో తాము ఎంతగా చెప్పిన వినిపించుకోకుండా, కనీస సెట్‌బ్యాక్ లేకుండా పనులు చేపట్టారని, పైసాపైసా కూడబెట్టి, ఊర్లో ఉన్న పొలాలు అమ్మి కట్టుకున్న భవనం కూలిపోతుందంటూ రోధిస్తున్నారు. కాగా ఈ భవనం చుట్టు ఉన్న ఇళ్ల యజమానులు సైతం భయాందోళనలో ఉన్నారు. భవనం శకలాలు తమ ఇళ్ల మీద పడితే తమ ఇళ్లకు ప్రమాదం సంభవిస్తుందని భయపడుతున్నారు.

**ఫైరింజన్ వచ్చేందుకు ఆపసోపాలే...**

సిద్దిఖ్‌నగర్‌లో భవనాలు ఎటువంటి సెట్‌బ్యాక్ లేకుండా, కనీస రహదారి వసతి లేకుండా చేపట్టడంతో హైడ్రా కూల్చివేత మిషన్‌ను భవనం వద్దకు తీసుకువచ్చేందుకు అధికారులు ఆపసోపాలు పడ్డారు. కాగా కూల్చివేత సమయంలో ముందు జాగ్రత్తగా ఫైరింజన్‌ను తీసుకువచ్చేందుకు అధికారులు ప్రయత్నించగా, ఇరుకు సందులతో ఫైరింజన్ భవనం వద్దకు చేరుకోలేదు. భవనానికి కొద్ది దూరంలో ఫైరింజన్‌ను నిలిపి అధికారులు కూల్చివేత పనులు కొనసాగిస్తున్నారు. జీహెచ్‌ఎంసీ అధికారుల నిర్లక్ష్యం, అవినీతి కారణంగా సిద్దిఖ్‌నగర్ బస్తీ మొత్తం 5నుంచి 7 అంతస్థుల భవనాలే కనిపిస్తుండగా, భవనాల మధ్య సెట్‌బ్యాక్ ఎక్కడా కనిపించడం లేదు. కనీసం ఫైరింజన్ వెళ్లే అవకావం లేకుండా రహదారులను ఆక్రమించి భారీ భవనాలు నిర్మించడంతో ప్రమాదాలు నిత్యకృత్యం అవుతున్నాయి. లక్ష్మణ్ భవనం నుంచి కనీస ఖాళీ స్థలం విడిచిపెట్టకుండా శ్రీను నిర్మాణ పనులు చేపట్టిన కారణంగానే ఈ ప్రమాదం చోటుచేసుకుందని అధికారులు తెలిపారు. నిర్లక్ష్యంగా తవ్వకాలు చేపట్టి ఇంతటి ప్రమాదానికి కారణమైన కల్వకుల్ల శ్రీను మీద మాదాపూర్ పోలీసులు కేసు నమోదు చేశారు. కాగా కూల్చివేత పనులు జాగ్రత్తగా చేపడుతుండడంతో గురువారం వరకు కొనసాగే అవకాశం ఉందని తెలుస్తుంది.

## ఘనంగా న్యాయవాదుల సహకార సంఘం రజతోత్సవాలు



రజతోత్సవాల్లో ప్రసంగిస్తున్న సంఘం అధ్యక్షులు శ్రీనాథ్ తదితరులు

**హైదరాబాద్, నవంబర్ 20,ప్రభాతవార్త:**

న్యాయవాదుల సంక్షేమానికి పాటుపడుతూ వారికీ ఉత్తమ సేవలు అందించడమే తమ లక్ష్యమని న్యాయవాదుల పరస్పర సహాయక సహకార సంఘం అధ్యక్షులు పి శ్రీనాథ్ పేర్కొన్నారు. నగరంలోని ఓ హోటల్ లో న్యాయవాదుల సహకార సంఘం వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా రజతోత్సవ ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యక్షులు శ్రీనాథ్ మాట్లాడుతూ పలువురు సభ్యుల సూచన మేరకు ఉప్పల్ భగాయత్ లోని సంఘం స్థలంలో కన్వెన్షన్ హాలు, ఆర్బిట్రేషన్ గదులు, స్పోర్ట్స్ అరేనా నిర్మించాలని నిర్ణయించినట్లు తెలిపారు. సహకార సంఘం మరింత అభివృద్ధి చెందడానికి అనుభవజ్ఞులైన న్యాయవాద సభ్యులు తగు సలహాలు, సూచనలు అందిస్తూ కొంత సమయాన్ని కేటాయించాలని కోరారు. తమ సంఘాన్ని స్ఫూర్తిగా తీసుకొని కొత్త సహకార సంఘాలు ఏర్పాటు అవుతున్నాయని అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో నూతనంగా ఏర్పాటవుతున్న ఏపీ న్యాయవాదుల సహకార సంఘంకు తగు సలహాలు సూచనలు ఇవ్వవలసిందిగా వారు చేసిన విజ్ఞప్తి మేరకు 16 నవంబర్ న విజయవాడ వెళ్లడం జరిగిందని తెలిపారు. ఈ సందర్భంగా వ్యవస్థాపక డైరెక్టర్లు, పూర్వ డైరెక్టర్లు, ప్రస్తుత డైరెక్టర్లకు శాలువా కప్పి, జ్ఞాపికలను అందజేసారు. ఈకార్యక్రమంలో అడ్వకేట్ సొసైటీ కార్యదర్శి టీ శ్రీధర్, ఉపాధ్యక్షులు ప్రవీణ్, పోలిశెట్టి రవి, అనిల్, గిరి, మహేశ్వర్, వ్యవస్థాపక డైరెక్టర్లు ఏం దుష్యంత్ రెడ్డి, బి శంకర్, జి రామ్ రెడ్డి, సునీల్, పూర్వ డైరెక్టర్లు జిఎస్ ప్రకాష్ రావు, జగత్ పాల్ రెడ్డి, కొండూరు వినోద్ కుమార్, అమర్నాథ్, జలకం కిషోర్, రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

**దేవాలయాలు ఆధ్యాత్మిక చింతనను పెంపొందిస్తాయి : ఎమ్మెల్యే**

**కొంపల్లి, నవంబర్ 20, ప్రభాతవార్త:** కొంపల్లి మున్సిపాలిటీ పరిధి దూలపల్లిలోని శ్రీ సీతారామచంద్రస్వామి, ఈ విశాలాక్షి విశ్వేశ్వర స్వామి దేవస్థానం వద్ద బుధవారం నిర్వహించిన రాజగోపుర శిఖర కలశ స్తంభన పూజా మహోత్సవానికి ఎమ్మెల్యే కెపి .వివేకానంద్ ముఖ్యఅతిథిగా హాజరై శ్రీ విశ్వేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ మాట్లాడుతూ పురాతన కాలంలో దేవాలయాల నిర్మాణంలో వేద పండితులు అనేక శక్తులతో స్వామివారిని ప్రతిష్టాపన చేయడం వలన ఆ పరిసర ప్రాంతాలు కూడా శక్తివంతమవుతాయని, తద్వారా మనము దేవాలయాలను సందర్శించినప్పుడు తెలియని శాంతన, మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు.

## బిసి వర్గాల అభివృద్ధి కోసం సలహాలు, సూచనలు ఇవ్వండి

**-23న జిల్లాలో బిసి కమిషన్ బహిరంగ విచారణ**

**-జిల్లా రెవెన్యూ అధికారి వెంకటా చారి**



సమావేశంలో మాట్లాడతున్న వెంకటాచారి, ఇతర అధికారులు

**హైదరాబాద్, నవంబర్ 20,ప్రభాతవార్త:**

రాష్ట్ర ప్రభుత్వం అట్టడుగు వర్గాల అభ్యున్నతికి తోడ్పడునందించేందుకు నియమించిన బీసీ కమిషన్ ఈనెల 23 న బహిరంగ విచారణ చేపట్టనున్నందున బీసీ తరగతులు చెందిన వారు సామాజిక, ఆర్థిక, విద్య రంగాలలో సలహాలు, సూచనలు బీసీ కమిషన్ కు ఇవ్వాలని హైదరాబాద్ జిల్లా రెవెన్యూ అధికారి ఈ.వెంకట చారి అన్నారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వివిధ కుల సంఘాలతో వారితో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో సామాజికంగా, విద్యాపరంగా, ఆర్థికంగా వెనుకబడిన తరగతుల స్థితిగతులనుపరిశోధించడానికి బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్, కమిటీ సభ్యులు రాపోలు జయప్రకాష్, తిరుమలగిరి సురేందర్, బాలలక్ష్మీ, బీసీ వెల్ఫేర్ కమిషనర్ సభ్య కార్యవర్గం గల బీసీ కమిషన్ ఈనెల 23 న హైదరాబాద్ కలెక్టరేట్( లక్డికాపూల్)లో ఉదయం 10.00 గంటల నుండి సాయంత్రం 4.00 గంటల వరకు బహిరంగ విచారణ చేపట్టనుందని అన్నారు. వెనుకబడిన తరగతులకు చెందినవారు ఆర్థిక, సామాజిక, విద్యాపరమైన సూచనలు,సలహాలు కమిషన్ కు అఫిడవిట్ రూపంలో అందించాలని సూచించారు. అఫిడవిట్ ఒరిజినల్ సెట్ ఒకటి తో పాటు 5 జిరాక్స్ సెట్లను (మొత్తం 6 సెట్లు) ఇవ్వవలసి ఉంటుందని అన్నారు. అఫిడవిట్‌కు ఎవిడెన్స్, సాక్షాలు ఉంటే పటిష్టంగా ఉంటుందన్నారు. అఫిడవిట్ స్వీకరణకు 3 కౌంటర్లు రిసెప్షన్, అప్లికేషన్ వెరిఫై, అసిస్టెన్స్ కోసం సలహాలు, మార్గదర్శనం చేసేందుకు డిప్యూటీ తహసిల్దార్, సహాయ బీసీ సంక్షేమ అధికారులను నియమించడం జరిగిందన్నారు. బీసీ వర్గాల అభ్యున్నతి కోసం సలహాలు సూచనలు ఇవ్వడానికి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సమావేశంలో బీసీ సంక్షేమ శాఖ ఉపసంచాలకులు జి ఆశన్న, జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి ఇలియాజ్ అహ్మద్, సహాయ బీసీ సంక్షేమ అధికారి టి. నరసింహులు, వివిధ కుల సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## నగరంలో రాష్ట్రపతి పర్యటన సందర్భంగా ట్రాఫిక్ ఆంక్షలు..

**-ఉత్వర్వులు జారీ చేసిన నగర ట్రాఫిక్ పోలీసు అదనపు కమిషనర్**

**పంజగుట్ట, నవంబర్ 20 (ప్రభాతవార్త):**

రాష్ట్రపతి ద్రౌపది ముర్ము హైదరాబాద్ నగర పర్యటన సందర్భగా ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తున్నట్లు నగర ట్రాఫిక్ అదనపు కమీషనర్ పి.విశ్వప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రపతి పర్యటన ఈ నెల 21,22 తేదీలలో అధికారికంగా నిర్ణయించబడింది. దీనిలో భాగంగా 21 తేదీ సాయంత్రం 5.30 గంటల నుండి 9 గంటల మధ్య పలు ప్రాంతాలలో ట్రాఫిక్‌ను మళ్లింపు చేయడం జరుగుతుందని తెలిపారు. పంజగుట్ట జంక్షన్, గ్రీన్‌ల్యాండ్స్ సంక్షన్‌లలో కొంతమేర పూర్తిగా ట్రాఫిక్ నిలిపివేయడంతో పాటు ప్రత్యామ్నాయ మార్గాలలో మళ్లించబడుతుంది. ఈ సమయాలలో గ్రీన్‌ల్యాండ్స్ జంక్షన్, బేగంపేట ఫ్లైఓవర్, హెచ్‌పిఎస్ అవుట్ గేట్, శ్యామ్‌లాట్ బిల్డింగ్ పిపిఎన్‌టి ఫ్లైఓవర్, ఎయిర్‌పోర్ట్ జంక్షన్, మోనప్ప జంక్షన్, యశోదా హాస్పిటల్, కత్రియా హోటల్, రాజ్‌భవన్‌రోడ్డు, మెట్రో రెసిడెన్సీ, వివిస్టాట్యూ, ఖైరతాబాద్ ఫ్లైఓవర్, నెక్లెస్ రోటరీ రోడ్డు, ఎన్టీఆర్ మార్గ్, తెలుగుతల్లి జంక్షన్, తెలుగుతల్లి ఫ్లైఓవర్, కట్టమైసమ్మ, ఇక్బాల్ మినార్, ఓల్డ్ అంబేద్కర్ స్టాట్యూ, ట్యాంక్‌బండ్, ఎన్టీఆర్ స్టేడియం, అశోక్‌నగర్ జంక్షన్ ప్రాంతాలలో ట్రాఫిక్ ఆంక్షలు, మళ్లింపులు ఉంటాయి. అదేవిధంగా 22 వ తేదీన ఉదయం 9 గంటలనుండి మధ్యాహ్నం 12.15 వరకు ట్రాఫిక్ ఆంక్షలతో పాటు కింది ప్రాంతాలలో మళ్లింపులు ఉంటాయని తెలిపారు. దీనిలో భాగంగా రాజ్‌భవన్ రైట్ మెట్రో, వివిస్టాట్యూ రైట్, కేసీపీ అన్సారీ మంజిల్, తాజ్‌క్రిష్ణ, ఎన్‌ఎఫ్‌సిఎల్, సాగర్‌సొసైటీ, ఎన్టీఆర్ భవన్, జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్, రోడ్డు నంబర్ 45 జంక్షన్, కేబుల్ బ్రిడ్జ్, రోడ్డు నంబర్ 65, జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్, పంజగుట్ట ఫ్లైఓవర్, మోనప్ప, ప్రజాభవన్, గ్రీన్‌ల్యాండ్స్, బేగంపేట ఫ్లైఓవర్, హెచ్‌పిఎస్ అవుట్ గేట్, శ్యామ్‌లాల్, పిఎన్‌టిలెఫ్ట్, ఎయిర్‌పోర్ట్ వై జంక్షన్, బేగంపేట ఎయిర్‌పోర్ట్ తదితర ప్రాంతాలలో రెండు రోజుల పాటు నిర్దేశిత సమయాలలో ట్రాఫిక్ ఆంక్షలు అమలులో ఉంటాయని ఆయన తెలిపారు. నగర పౌరులు ఈ విషయాలను దృష్టిలో పెట్టుకుని ఆయా సమయాలలో ఆ ప్రాంతాలలో ప్రయాణించకుండా ప్రత్యామ్నాయ మార్గాలను చూసుకోవాలని ఎడిషనల్ కమీషనర్ ట్రాఫిక్ విశ్వప్రసాద్ విజ్ఞప్తి చేశారు.

## సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే

**-జిహెచ్‌ఎంసి పరిధిలో 57.30శాతం పూర్తి**



నగరపోలీస్ కమిషనర్ సివిఆనంద్‌కు సర్వేపత్రాలు అందిస్తున్న ఎన్యూమరేటర్లు

**హైదరాబాద్, నవంబర్ 20,ప్రభాతవార్త:**

జిహెచ్‌ఎంసి వ్యాప్తంగా సర్వే వియవంతంగా జరుగుతున్నది. నగర ప్రజలు ఎన్యుమరేటర్లకు పూర్తి సహకారం అందించడం మూలంగా సర్వే నగర వ్యాప్తంగా ముమ్మరంగా కొనసాగుతున్నది. నగరంలో చేపట్టే సర్వేలో సినీ ప్రముఖులు, ఉన్నతాధికారులు పదవీవిరమణ పొందిన ఐఎఎస్, విధ పార్టీల నాయకుల సర్వే సిబ్బంది పూర్తి వివరాలను నమోదు చేసుకుంటున్నారు. ఈనేపథ్యంలో సిపి సివి ఆనంద్, మాజీ ఐఎఎస్ చిరంజీవులు బుధవారం కుటుంబసర్వేలో పాల్గొన్నారు. ఇంటికి వచ్చిన ఎన్యూమరేటర్లుకు పూర్తి సమాచారం అందించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి అవకాశాల మెరుగుకు రాజకీయ, మరియు కుల సర్వే ప్రకారం ప్రజలకు అవసరమైన పథకాలకు రూపకల్పన చేసేందుకు అవకాశం ఏర్పడుతుందన్నారు. తప్పులు లేకుండా సర్వే ను సమర్ధవంతంగా నిర్వహించేందుకు ఎన్యూమరేటర్లకు సూచనలు, సలహాలు ఇస్తూ ప్రభుత్వ నిర్దేశించిన మేరకు కోడింగ్ ప్రక్రియను సవర్ధవంత్తంగా పూర్తి చేయుటకు మానిటరింగ్, నోడల్, జోనల్ అధికారులు విశేష కృషి చేస్తున్నారు. ఈ నేపథ్యంలో జిహెచ్‌ఎంసి వ్యాప్తంగా బుధవారం 1,32,656 కుటుంబాల సర్వే పూర్తి కాగా, ఇప్పరు వరకు 13,91,817 కుటుంబాల సర్వే పూర్తి తో..57.30 శాతం సర్వే పూర్తి చేసారు.

## బట్టల షాప్ దగ్ధం

**అత్తాపూర్ నవంబరు20,ప్రభాతవార్త :** షార్ట్ సర్క్యూట్ తో ఓ బట్టలు షాప్ పూర్తిగా దగ్ధమైన సంఘటన అత్తాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు వివరాల ప్రకారం...రాజేంద్రనగర్ సర్కిల్ శివరాంపల్లిలోని శ్రీలక్ష్మి క్లాత్ టెక్స్‌టైల్స్ బట్టల దుకాణంలో మంటలు చేలరిగి చుట్టుపక్కల ప్రాంతాలన్ని దట్టంగా పొగలు అలుముకోవడంతో స్థానికులంతా భయాందోళనకు గురియ్యారు. స్థానికుల సమాచారంతో సంఘటన స్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. షాప్‌లో ఉన్న బటలు పూర్తి గా కాలిపోయాయి. ఎలాంటి ప్రాణం నష్ట జరగలేదని కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.

## జిహెచ్‌ఎంసి ఉద్యోగులను పట్టుకున్న ఎసిబి

**-లంచం డిమాండ్ చేయడంతో రెడ్‌హ్యాండెడ్‌గా దొరికిపోయిన ఇద్దరు ఉద్యోగులు..**

**పంజగుట్ట,నవంబర్ 20 (ప్రభాతవార్త):**

లంచం డిమాండ్ చేయడంతో ఇద్దరు జీహెచ్‌ఎంసీ అధికారులను అవినీత నిరోధక శాఖ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. వివరాల ప్రకారం..జీహెచ్‌ఎంసీ సర్కిల్ 18లో ఫీల్డ్ అసిస్టెంట్‌లుగా పనిచేసే సలీంఖాన్, రమేష్‌లు ఓ కాఫీషాప్‌లో ఫైన్ కట్టాలని లేకపోతే ఇబ్బందులు పడాల్సి వస్తుందని బెదిరించారు. 60 వేలు లంచం ఇస్తే మీకు ఎలాంటి సమస్యలు ఉండవని చెప్పారు. దీంతో కాఫీషాప్ యాజమాన్యం బేమాడి 25 వేలకు ఒప్పించారు. వెంటనే ఈ విషయమై ఏసీబీ అధికారులకు సమాచారం ఇవ్వగా, వారు వ్యూహం ప్రకారం డబ్బులిచ్చే సమయంలో అక్కడకు చేరుకుని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఫింగర్ ప్రింట్స్ ఆధారంగా బాధితుడి నుంచి డబ్బులు తీసుకున్నారని తెలుసుకుని వారిని అదుపులోకి తీసుకుని, బుధవారం ఏసీబీ కోర్టుకు తరలించారు.

# విజిలెన్సుఅధికారులు ఉన్నా లేనట్లే..

**-సర్కిల్ 23లో కోట్లు కురిపిస్తున్న అక్రమ నిర్మాణాలు -వసూల్ రాణి, అదృశ్య శక్తుల వసూళ్ల లీలలు**







**హైదరాబాదు నవంబరు 20,ప్రభాతవార్త**

మూసాపేట సర్కిల్ 23 టౌనుప్లానింగ్ విభాగంలో విధులు నిర్వహిస్తున్న ఓ మహిళా అధికారితోపాటు కొందకు మధ్యవర్తులు, సిబ్బంది తమకు అడ్డే లేదన్న ధీమాతో వ్యవహరిస్తూ బిల్డర్ల అక్రమ నిర్మాణాలకు తమ వంతు సహకారం అందిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. పలు ప్రాంతాల్లో అక్రమ నిర్మాణాలకు నానాటికి అడ్డూ అదుపులేకుండా పోతుంది. కెపిహెచ్‌బి కాలనీ, బాలాజీనగర్ తదితర ప్రాంతాల్లో వెలుస్తున్న అక్రమ నిర్మాణాలపై ప్రజావాణితో పాటు కీలక బాధ్యతలు నిర్వహిస్తోన్న అధికారులకు స్వయంగా ఫిర్యాదులు చేస్తున్నా పట్టించుకోకపోవడం గమనార్హం. కొందరు అధికారులకు బిల్డర్లు, అక్రమ నిర్మాణదారులకు మధ్యవర్తులుగా వ్యవహరిస్తూ రూ.కోట్లల్లో వసూళ్ళు చేస్తున్న అదృశ్య శక్తులతోపాటు సిబ్బంది అక్రమాలను వెలికితీసి ఉన్నతాధికారులకు నివేదికలు అందచేయడంలో జిహెచ్‌ఎంసి విజిలెన్స విభాగం అధికారులు పట్టించుకోకుండా చూసినా చూడనట్లుగా నటించడంలో అంతర్యమేమిటోనని పలువురు ప్రశ్నిస్తున్నారు. విజిలెన్సు విభాగం ఉన్నా లేనట్లేనని, అక్రమార్కుల అక్రమాలను వెలికితీసి ప్రభుత్వ ఆదాయాన్ని పెంచడాకి చర్యలు తీసుకోవడంలో ఓ వైపు జిహెచ్‌ఎంసి ఉన్నతాధికారులతోపాటు విజిలెన్సు విభాగం అధికారులు ఘోరంగా విఫలమవుతున్నారు. మధ్యవర్తులు, లైసెన్స్ ప్లానర్లతో వసూళ్ళతో అక్రమార్జనకు పాల్పడుతున్నట్లు అధికారులపై ఆరోపణలు ఉన్నాయి. అనుమతి పొందిన ప్లాన్‌కు విరుద్దంగా అదనపు అంతుస్తులు నిర్మించడం ఏ మాత్రం సెట్‌బ్యాక్ వదలకుండా అక్రమ నిర్మాణాలు నిర్మించడం లాంటి అక్రమాలు యదేచ్ఛగా కొనసాగుతున్నాయంటే అధికారుల అండదండలు అక్రమ నిర్మాణాలకు ఏ విధంగా ఉన్నాయో అర్థమవుతుంది. ఇన్ని అక్రమాలు జరుగుతున్నా అక్రమాలను వెలికితీసే విజిలెన్సు శాఖ అధికారులు దృష్టిసారించి అక్రమ నిర్మాణాలకు అండదండలు అందిస్తున్న ఇందుకు బాద్యులైన సంబంధిత టౌన్ ప్లానింగ్ అధికారులపై ఎందుకు చర్యలు తీసుకోవడంలేదని పలువురు ప్రశ్నిస్తున్నారు. భవన నిర్మాణాల అనుమతులకు ఓ రేటు అక్రమ నిర్మాణాలకు మరో రేటు వసూలు చేస్తున్న కొందరు అధికారులకు కమర్షియల్ భవనాలు కామధేనువులా మారి రూ. కోట్లు కురిపిస్తున్నాయి. పలు ప్రాంతాల్లో బహుళ అంతస్తుల భవనాల నిర్మాణం అధికమవుతున్నది. బిల్డర్లు ఓ వైపు నాణ్యతా ప్రమాణాలు పాటించకుండా మరో వైపు తీసుకున్న అనుమతులకు విరుద్దంగా నిబంధనలకు పాతరేసి అడ్డగోలుగా అనుమతులు సాధించి బహుళ అంతస్తుల భవనాల్ని బిల్డర్లు చక చకా నిర్మించేస్తున్నారు. అక్రమ నిర్మాణాలకు తమ వంతు సహకారం అందించడంతోపాటు భవన నిర్మాణ అనుమతుల కోసం భారీ ఎత్తున వసూళ్ళకు పాల్పడుతూ ఒక్కో అధికారి అక్రమార్జనకు పాల్పడుతూ అక్రమంగా సంపాదిస్తున్నట్లు సమాచారం. ఇళ్ళ నిర్మాణాల అనుమతి కోసం టీఎస్‌బీపాస్ విధానాన్ని రాష్ట్ర పభుత్వం ప్రవేశపెట్టింది. అయితే టీఎస్‌బీపాస్ విధానానికి కొందరు అధికారులు తూట్లు పొడుస్తూ మామూళ్ళ కోసం దరఖాస్తుదారులను ముప్పు తిప్పలు పెడుతున్నారు. అదే విధంగా పెద్దఎత్తున పెరుగుతున్న నిర్మాణాలకు అనుగుణంగా జిహెచ్‌ఎంసి ఆదాయం కూడా పెరుగాల్సి ఉంటుంది. అయితే టౌన్‌ప్లానింగ్ విభాగంలోని కొందరు అధికారులు చేతివాటానికి అలవాటుపడి అక్రమ నిర్మాణాలకు తమ వంతు సహకారం అందించి గ్రేటర్ ఆదాయానికి గండికొడుతున్నారు. అక్రమ నిర్మాణాలు చేపడితే అధికారులు నియమించుకున్న వ్యక్తులు అక్కడ చేరి సర్కిల్ కార్యాలయాల్లో అధికారులను కలువాలని హుకుం జారీ చేస్తారు. ముడుపులు అప్పగిస్తేనే అక్రమ నిర్మాణం సక్రమంగా కొనసాగుతుంది. కెపిహెచ్‌బి కాలనీ, బాలాజీనగరు తదితర ప్రాంతాల్లో అనేక మంది టీఎస్‌బీపాస్‌తో అనుమతి తీసుకుని నిబంధనలకు విరుద్దంగా ఐదారు అంతస్తుల్ని నిర్మిస్తున్నా ఇక్కడ కీలక బాధ్యతల్ని నిర్వహిస్తోన్నా టౌనుప్లానింగన అధికారులు అడ్డుకోవడంలేదు. టీఎస్‌బీపాస్‌తో అనుమతి తీసుకుని అందుకు విరుద్ధంగా నిర్మాణాలు చేపడితే ఎలాంటి నోటీసులు ఇవ్వకుండానే సదరు భవనాల్ని కూల్చివేయవచ్చు. పలు ప్రాంతాల్లో వెలుస్తున్న కమర్షియల్ భవనాలతోపాటు ఐదారు అంతస్తుల వరకు వెలుస్తున్న అక్రమ అపార్ట్‌మెంట్ల నిర్మాణాలకు టీపీఎస్ అక్రమ నిర్మాణాలను ప్రోత్సహిస్తున్నట్లు కొందరు అధికారులపై కూడా ఆరోపణలు వస్తున్నాయి. స్వయంగా జిహెచ్‌ఎంసి కమిషనర్ అక్రమ నిర్మాణాలను అడ్డుకోవాలని ఆదేశిస్తున్నా కొందరు టౌన్ ప్లానింగ్ అధికారులు పట్టించుకోకుండా మామూళ్ళకే పరిమితం అయ్యారు.

**నిర్మాణాలు..**

సామాన్య, మధ్య తరగతి వర్గాలకు చెందిన వారు అనుమతుల కోసం వెళితే లేనిపోని నిబంధనలు చెప్పి ఇబ్బందులు పెట్టే అధికారులు బిల్డర్లు చేపుడుతున్న అ క్రమ వాణిజ్య భవనాల విషయంలో ఎందుకు చూసీ, చూడనట్టుగా వ్యవహరిస్తున్నారని పలువురు ప్రశ్నిస్తున్నారు. నిబంధనలు పాటించని వారిపై కొరడా ఝులిపిస్తామని ప్రకటనలు గుప్పిస్తున్న అధికారులు ఆచరణలో మాత్రం ఘోరంగా విఫలమవుతున్నారు. బిల్డర్ల మాయమాటలకు ఆకర్షితులై అపార్ట్‌మెంట్లలో ప్లాట్లను కొన్న తర్వాత అందులో సదుపాయాలు లేక కొనుగోలు దారులు నిత్యం ఇబ్బందులు పడుతున్నారు. పార్కింగ్ కోసం స్థలం లేకపోవడంతో వాహనాలు బయటనే పార్కింగ్ చేయాల్సిన పరిస్థితి. వ్యాపార సంస్థలకు వచ్చే కొనుగోలుదారులు వారు తమ వాహనాలను రోడ్ల మీదనే పార్కింగ్ చేయాల్సిన పరిస్తితి నెలకొంది. నిత్యం ట్రాఫిక్ సమస్యలతో స్థానికులతోపాటు కొనుగోలు దారులు ఇబ్బందులు పడుతున్నారు. ఇలాంటి భవనాల వల్ల అనేక సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయనిబంధనలు పాటించకుండా కొత్తగా నిర్మించే కమర్షియల్ భవనాల్ని అడ్డుకోవడంలో అధికారులు ఎందుకు దృష్టి సారించడంలేదని పలువురు ప్రశ్నిస్తున్నారు. అధికారుల ధన దాహం కారణంగానే అక్రమ అపార్ట్‌మెంట్లు, నిర్మాణాలు పెద్దఎత్తున వెలిశాయి. జిహెచ్‌ఎంసి నిబంధనల్ని అతిక్రమించినా సరే కొందరు టౌన్‌ప్లానింగ్ అధికారులు నిర్ణయించిన ముడుపులు ముట్టచెబితే అక్రమ అపార్ట్‌మెంట్లు అయినా, నిర్మాణాలకయినా వెంటనే అధికారుల ఆమోద ముద్రపడుతుంది. దీన్ని బట్టి కొందరు టౌన్‌ప్లానింగ్ విభాగం అధికారులు జేబులు నింపుకోవడానికే మాత్రమే పరిమితమవుతున్నారని అర్థమవుతుంది.. అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ)తోపాటు జిహెచ్‌ఎంసి విజిలెన్స్ విబాగాలు దృష్టి సారిస్తే బిల్డర్లు అక్రమ నిర్మాణాలు సక్రమంగా సాగేందుకు అధికారులు ఏ మేర రూ.కోట్లల్లో అక్రమార్జనకు పాల్పడుతున్నారో వారి అవినీతి భండారం బయటపడుతుందని పలువురు పేర్కొంటున్నారు.

